అవినీతి 'ద్వారం' బద్ధలు




- బద్ధలవుతున్న కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి పాపాల పుట్ట
- అధికారం చేతిలో ఉన్న అయిదేళ్లు విచ్చలవిడిగా చెలరేగిపోయిన వైనం
- నా అంతటోడు లేడనేలా విర్రవీగుడు: ఎక్కడికక్కడ దందాలు, దౌర్జన్యాలు, అక్రమాలు
- తీరా ఇప్పుడు పార్టీ ఓటమి పాలవడంతో ఒక్కొక్కటిగా వెలుగులోకి పాపాల చిట్టా
- ద్వారంపూడి చుట్టూ బిగుస్తున్న వందల కోట్ల రేషన్‌బియ్యం మాఫియా స్కాం
- ద్వారంపూడి కుటుంబం లక్షల టన్నుల రేషన్ బియ్యం ఎగుమతులపై లోతుగా ఆరా
- కేసును సీఐడీకి అప్పగించబోతున్నట్లు మంత్రి నాదెండ్ల ప్రకటనలో గుబులు
- వెలుగులోకి ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీల అక్రమాలు: పీసీబీ నోటీసులతో గుట్టురట్టు
- అధికారం అండతో కాకినాడలో ద్వారంపూడి బంధువులు, అనుచరులు అక్రమ నిర్మాణాలు
- కూల్చివేతకు అడుగులు ప్రారంభించిన కార్పొరేషన్ » అడ్డుకున్నందుకు ద్వారంపూడి, ఆయన అనుచరులపై కేసు
- ద్వారంపూడి అనుచరుడి కబ్జా చెర నుంచి రూ.25కోట్ల విలువైన భూమికి విముక్తి
- కాకినాడ పోర్టులో రూ.73కోట్ల స్వాహాపై ఎమ్మెల్యే కొండబాబు ఆధారాలతో బయటకు
- భయం వీడి న్యాయం కోసం రోడ్డెక్కిన భాస్కర బిల్డింగ్ బాధితులు
- ద్వారంపూడి అనుచరుల గంజాయి సేవనం కోసం ఐదేళ్లుగా మూసేసిన రోడ్డుకు మోక్షం

లేకలేక అధికారం చేతికి రావడంతో ఎమ్మెల్యేగా ఉండగా ఆయన విర్రవీగిపోయాడు. నా అంతటోడు లేడనుకుని ఐదేళ్లు విచ్చలవిడిగా వ్యవహరించాడు. సాక్షాత్తూ సీఎం తనకు సన్నిహితుడు కావడంతో ఆ వంకతో నియోజకవర్గంలోను, జిల్లాలోను తానే ఓ సీఎం తరహాలో నిరంకుశంగా వ్యవహరించాడు. కనిపించిన కొండలు, గుట్టలను మింగేశాడు. తనకున్న వ్యాపారాలను నిబంధనలను ఖాతరు చేయకుండా నడిపాడు.. కన్నేసిన కోట్ల విలువైన భూములను కబ్జా చేసి పారేశాడు. అవినీతి, అక్రమాలకు ద్వారం తెరిచాడు.. ఏ టెండర్ పిలిచినా తెరవెనుక తన మనుషులను పంపి పనులు కొట్టేసి కోట్లు కొల్లగొట్టేశాడు. కార్పొరేషన్ నిబంధనలు అతిక్రమించి తన వాళ్లు సొంత భవనాలను కట్టుకునేలా అడ్డుగా నిలబడ్డాడు. తనకు ఎదురుగా రూల్స్ మాట్లాడిన అధికారులను నిర్దాక్షిణ్యంగా రాత్రికి రాత్రే శంకరగిరి మాన్యాలు పంపేశాడు. ఓ పక్క రెండు చేతులతో వందల కోట్ల సంపాదన.. మరోపక్క అడ్డొచ్చిన వారిని నోటితో పచ్చిబూతులు తిడుతూ కన్నూ మిన్నూ కానకుండా అయిదేళ్లు అరాచకం సృష్టించాడు. తీరాకాలం తిరగబడ్డంతో ఇప్పుడు అధికారం కోల్పోయి విలవిల్లాడుతున్నాడు. ఒక్కో పాపం బద్ధలవుతుండంతో వణికిపోతున్నాడు. ఎప్పుడు ఏమూలన తన పాతకాలు పండుతాయోనని కునుకులేకుండా కలవర పడుతున్నాడు. అతడే కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి. ఎన్నికల్లో ఓటమి పాలవడంతో అయిదేళ్లలో ఈయన అరాచకాలు, అక్రమాలు, పాపాలు ఒక్కోటిగా బయటపడుతుండడం అందరినీ ముక్కున వేలేసుకునేలా చేస్తోంది.



కాకినాడలోని గొడారిగుంటలో ఇటీవల అక్రమ నిర్మాణాల తొలగింపును అడ్డుకోబోయిన ద్వారంపూడిని నిలువరిస్తున్న పోలీసులు



ప్రత్తిపాడు మండలం లంపకలోవలో అక్రమాల కారణంగా నోటీసులు అందుకున్న ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)



ద్వారంపూడి బియ్యం మాఫియాపై ఇటీవల వివరాలు తెలియజేస్తున్న మంత్రి నాదెండ్ల



కాకినాడ పోర్టులో ద్వారంపూడి అక్రమాలపై విలేకరులకు వివరిస్తున్న ఎమ్మెల్యే వనమాడి

అంతా నా ఇష్టం..

కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి జూన్ 4కు ముందు అధికార పార్టీ ఎమ్మెల్యే. అంతకుమించి సీఎం జగన్ సన్నిహితుడు. ఇతడి పేరెత్తితే భయపడని వారంటూ లేరు. జిల్లా అధికారులనుంచి జిల్లాలో సొంతపార్టీ మంత్రి, ఎమ్మెల్యే వరకు ఆయన అంటే హడల్. ఆయన చెప్పిందే వేదం. ఆదేశించిందే శాసనం. ఆయనకు ఎదురుతిరిగితే వైసీపీ రాజ్యసభ సభ్యుడైనా, ఆర్డీవో అయినా, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ అయినా, కలెక్టర్ అయినా వెనక్కు తగ్గాల్సిందే. లేదంటే బూతులు.. కాదంటే బదిలీలు ఇలా ఒకటేంటి ఐదేళ్లపాటు ఓ నయా నియంతలా చెలరేగిపోయారు. తన మాటకు ఎదురు లేదన్నట్లు విరగబడ్డాడు. జగన్ పేరు చెప్పి జిల్లాను గుప్పిట పట్టాడు. కనిపించిన వనరులను కొల్లగొట్టేశాడు. పేదల ఇళ్ల స్థలాల చదును పేరుతో కోట్లు మెక్కేశాడు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఈయనేం చెప్తే అంత అన్నట్లు చెలరేగిపోయాడు.

ఇలా ఒకటేంటి విరగబాటుకు, విచ్చలవిడితనానికి మారు పేరుగా రెచ్చిపోయారు. విలువైన భూముల కబ్జాలు, ఇసుక వ్యాపారం, సొంత కంపెనీలు నిబంధనలు లేకుండా నడిపిం చడం, రేషన్ బియ్యం మాఫియా, విదేశాలకు వందల కోట్లలో అడ్డగోలు ఎగుమతులతో ఎదురేలేదన్నట్లు వ్యవహరించారు. గత అయిదేళ్లలో వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు సీఎం తరహాలో పెత్తనం సాగించారు. కబ్జాలు, దౌర్జన్యాలు, అక్రమ వ్యాపారాలు అనేక రూపాల్లో ద్వారంపూడి విశ్వ రూపం ప్రదర్శించి అవినీతి మేతలో రికార్డులు సృష్టించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోవడం, ద్వారంపూడి సైతం కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా ఓటమి పాలవడంతో ఇప్పుడు జిల్లా, కాకినాడ సిటీ నియోజకవర్గాల పరిధిలో ఇతడి అక్రమాలు, అరాచకాలు, పాపాలు ఒక్కోటిగా బయటపడుతుండడం సంచలనం రేపుతోంది. ఐదేళ్ల పాపాల పుట్టలు ఒక్కొక్కటిగా పగులుతుండడంతో ఐదేళ్లలో ఇన్ని అరాచకాలకు పాల్పడ్డాడా అనే చర్చ ప్రజల్లోను, సొంత పార్టీలోను జరుగుతోంది. ప్రధానంగా ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో రెండు రోజులు పర్యటించారు. కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమవుతోన్న రేషన్ బియ్యం మాఫియాపై ఉక్కుపాదం మోపారు. ఆరు గోడౌన్లలో వేల మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేశారు. కాకినాడ పోర్టునుంచి విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతులను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో ద్వారంపూడి ఐదేళ్లనుంచి రెట్టింపు స్థాయిలో చేసిన బియ్యం అక్రమ వ్యాపారం గుట్టును మంత్రి బయటకు తీశారు. ద్వారంపూడి కుటుంబం రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసి ఎలా సంపాదిస్తున్నదీ బయట ప్రపంచానికి తెలిపారు. గోదాముల్లో సేకరించిన బియ్యం శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించారు. ఈ దాడుల్లో ద్వారంపూడికి ప్రధాన అనుచరులుగా ఉన్న అలీషాతోపాటు మరికొందరి పేర్లు కూడా బయటకు వచ్చాయి. వేలకోట్ల రేషన్ బియ్యం కుంభకోణాన్ని త్వరలో కూటమి ప్రభుత్వం సీఐడీకి అప్పగించేందుకు చకచకా పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో ద్వారంపూడి చీకటి బియ్యం వ్యాపారం బద్ధలు కానుంది. ఈ కేసులో ద్వారంపూడి నిండా మునిగిపోవడం ఖాయమనే చర్చ జరుగుతోంది.

ఎంతలా చెలరేగిపోయాడో...

అధికారం చేతిలో ఉన్నప్పుడు ద్వారంపూడి, ఆయన అనుచరులు కాకినాడ రూరల్ నియోజకవర్గం వాకలపూడిలో నాలుగున్నర ఎకరాల భూమిని కబ్జా చేసేశారు. రూ.25కోట్ల విలువైన భూమిని చెరబట్టారు. దీనిపై స్థల యజమానులు పోలీసులను ఆశ్రయించారు. కానీ ద్వారంపూడి బలానికి భయపడి ఆ భూమి జోలికి వెళ్లలేదు. ఇప్పుడు ద్వారంపూడి చేతిలో అధికారం లేకపోవడంతో బాధితులకు ధైర్యం వచ్చింది. ప్రాణభయం పోవడంతో ఎట్టకేలకు గురువారం తన భూమిలోకి ధైర్యంగా అడుగుపెట్టారు. ఎక్స్‌కవేటర్లతో అడ్డగోలుగా నిర్మించిన ప్రహరీని ధ్వంసం చేసి తన భూమిని తమ చేతిలోకి తీసుకున్నారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం గురజనాపల్లి, ప్రత్తిపాడు నియోజకవర్గం లంపకలోవలో ద్వారంపూడికి రెండు రొయ్యల ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ రెండుచోట్ల వ్యర్థజలాల విషయంలో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. అధికారం చేతిలో ఉండడంతో ఇన్నాళ్లు కాలుష్య విభాగం అధికారులు నోరెత్తలేదు. కానీ ఆశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఇటీవల సమీక్షించినప్పుడు ఈ కంపెనీలో లోపాలు భారీగా బయటపడ్డాయి. ఈనెల 3న అధికారులు ఈ రొయ్యల ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేసి అనేక తప్పులు గుర్తించి నోటీసులు జారీ చేయడంతో ద్వారంపూడి భాగోతం వెలుగులోకి వచ్చింది. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఎవరు ఏ భవనం నిర్మించినా అనుమతులు తీసుకోవాలి. కానీ ద్వారంపూడి తనకు రూల్స్‌తో పనిలేదనుకున్నాడు. ఆయన మనుషులు అడ్డగోలుగా భవనాలు నిర్మించినా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా లక్ష్మీ ఆస్పత్రి సమీపంలో ఓ అక్రమ భవనం నిర్మాణాన్ని కూల్చివేయడానికి వెళ్లారు. దీన్ని ద్వారంపూడి అడ్డుకున్నారు. కూల్చడానికి వీల్లేదని హెచ్చరించారు. అయినా అధికారులు పట్టువీడకపోవడంతో చేతిలో అధికారం లేని ద్వారంపూడి దారికి వచ్చాడు. అదే సమయంలో తమ విధులకు ఆటంకం కలిగించారని అధికారుల ఫిర్యాదుతో పోలీసులు ద్వారంపూడిపై గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. ఈయన అధికార పీఏగా పనిచేసిన సుబ్బారావు, వ్యక్తిగత పీఏ గోవిందరాజులు సైతం పలుచోట్ల అక్రమ భవన నిర్మాణాలు చేపట్టడం, చేపట్టిన వారినుంచి లంచాలు తీసుకున్న ఫిర్యాదులు రావడంతో త్వరలో వాటి భరతం పట్టనున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో ప్రభుత్వం రెండేళ్ల కిందట ఆధునికీకరణ పనులు చేపట్టారు. సముద్రంలో డ్రెడ్జింగ్ పనుల్లో ద్వారంపూడి రూ.73కోట్ల అవినీతికి పాల్పడ్డట్లు కాకినాడ సిటీ టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు నేరుగా ఆధారాలతో గురువారం బయటపెట్టారు. దీనిపైనా లోతుగా దర్యాప్తు చేయనున్నారు. తన మనుషులు గంజాయి సేవనానికి ఇబ్బందిగా ఉందనే కారణంతో నగరంలో డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారిని ద్వారంపూడి అయిదేళ్లుగా మూసేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే కొండబాబు ఈ రహదారిని తిరిగి తెరిపించడం ద్వారంపూడి దౌర్జన్యాన్ని బయటపెట్టింది. భాస్కర బిల్డింగ్ పేరుతో కాకినాడ సినిమా రోడ్డులో అపార్ట్‌మెంట్‌ల్లో ఇళ్లను ద్వారంపూడి విక్రయించారు. తీరా నాలుగేళ్ల కిందట అపార్ట్‌మెంట్ పిల్లర్లు ఓ పక్కకు వంగిపోయాయి. దీంతో అపార్ట్‌మెంట్‌ను అంతా ఖాళీ చేసేశారు. ఈ నేపథ్యంలో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు కోరినా ద్వారంపూడి ఖాతరు చేయలేదు. అధికారులు, పోలీసుల దగ్గరకు వెళ్లినా అమ్మో.. ద్వారంపూడి విషయంలో జోక్యం చేసుకోలేమనేశారు. ఇప్పుడు సదరు నేత అధికారం పోవడంతో బాధితులు ధైర్యం తెచ్చుకుని పోరాటం సాగిస్తున్నారు. ఇలా ఒకటేంటి అనేక పాపాలు వరుసపెట్టి బద్ధలవుతుండడంతో ద్వారంపూడి అరాచక సామ్రాజ్యం కుప్పకూలుతోందనే చర్చ జరుగుతోంది.

మున్సిపల్ షాపుల్లో ఆక్రమణల తొలగింపు

- ద్వారంపూడి అండతో నిబంధనలకు విరుద్ధంగా షాపుల కేటాయింపు
- 24 షాపులను ఖాళీ చేయించిన అధికారులు



కాకినాడ నగరపాలక సంస్థ షాపులను ఖాళీ చేస్తున్న అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 5: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్‌లో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి అండతో ఆక్రమించిన నగరపాలక సంస్థ షాపులను అధికారులు శుక్రవారం ఖాళీ చేయించారు. కాకినాడ సంజయ్‌నగర్ డైరీఫాం సెంటర్‌లో శ్రీపిడుగులమ్మ తల్లి మార్కెట్ వర్తకులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్పొరేషన్‌నుంచి అనుమతి లేకుండా వ్యాపారం చేస్తున్నవారిని అధికారులు షాపులు ఖాళీ చేస్తుండగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో 2023, అక్టోబరులో నగరపాలకసంస్థకు చెందిన 24 షాపులను అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి ప్రారంభించారు. నగరపాలకసంస్థ వేలం ప్రకటన ఇవ్వకుండానే వైసీపీఅనుకూల వ్యాపారులు షాపులు ఆక్రమించారు. కార్పొరేషన్‌కి అడ్వాన్స్, అద్దెలు చెల్లించకుండా వ్యాపారాలు చేస్తున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో నగరపాలక సంస్థ రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులతోపాటు అర్బన్ తహసీల్దార్ కార్యాలయ అధికారులు, పోలీసులు సహకారంతో ఆక్రమణలు తొలగించారు. కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శేఖర్, డీఈ మాధవి మాట్లాడుతూ టెండర్లు నిర్వహించకుండా 24షాపుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖాళీ చేయించామన్నారు.

డయేరియా కలకలం



- జిల్లాలో పలుచోట్ల కేసులు నమోదు
- తాజాగా 18మంది జింబాబ్వే విద్యార్థులకు డయేరియా
- కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స
- ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 5: ప్రతిఏటా వర్షాకాలం వస్తోందంటే సీజనల్ వ్యాధులపట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటారు. అనుకోని విధంగా డయేరియా అధికారులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. జిల్లాలో ఇప్పటికే రెండు డయేరియా మృతి కేసులు నమోదయ్యాయి. తొండంగి మండలం కొమ్మనాపల్లి, సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామాల్లో డయేరియా మరణాలు నమోదయ్యాయి. జిల్లా కలెక్టర్ ఈ అంశంపై సీరియస్ అవ్వడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇతర అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారులు ఆయా గ్రామాల్లో చుట్టుపక్కల గ్రామాల్లో వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లించి శాంపిల్స్ తీయడంతో సమస్యను అధికారులు గుర్తించడంతో విఫలమయ్యారు. జిల్లా ఆహారభద్రత నియంత్రణ అధికారి ఆయన బృందంతో చేపట్టిన శాంపిల్స్‌లో సమస్యను గుర్తించినట్లు తెలిసింది. వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లడంవల్ల బ్యాక్టీరియాను గుర్తించడం కష్టమని నిపుణులు పేర్కొంటున్నారు.

కాకినాడలో ఒక ప్రైవేట్ కాలేజీలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న 18మంది జింబాబ్వే విద్యార్థులకు డయేరియా సోకడంతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏడుగురు విద్యార్థులకు సీరియస్ అవ్వడంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. మిగిలిన 11మంది విద్యార్థులు చికిత్స తీసుకుని హాస్టల్‌కి వెళ్లిపోయారు. ఆస్పత్రిలో ఉన్న ఏడుగురిలో నలుగురు శుక్రవారం డిశ్చార్జి అయి హాస్టల్‌కి వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ వెంకటరావు, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, ఆహారభద్రత నియంత్రణ అధికారి శ్రీనివాస్ విద్యార్థులను పరామర్శించారు. సమస్య ఎక్కడుందో గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. దీంతో అధికారులంతా నగరంలోని పలు ప్రాంతాల్లో రోజుకు వెయ్యి వాటర్ శాంపిల్స్ తీసి పరీక్షిస్తున్నారు. విద్యార్థుల స్టూల్ శాంపిల్స్ పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కి పంపించారు. దీనిపై కమిషనర్, ఇతర అధికారులు కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేట్ సంస్థలతో సమావేశాలు నిర్వహించి పరిస్థితి చక్కదిద్దేందుకు తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు. వాతావరణ పరిస్థితులు మారుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బయట ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోవద్దని సూచిస్తున్నారు. స్ట్రీట్ వెండర్స్ ఆహార పదార్థాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



విద్యార్థినిని పరామర్శిస్తున్న కమిషనర్

డయేరియా అంటే?

ఉన్నట్టుండి రెండు కన్నా ఎక్కువసార్లు పెద్దపెద్ద నీళ్ల విరేచనాలు అవ్వడాన్ని డయేరియా అంటారు. దీంతోపాటు జ్వరం ఉండొచ్చు, ఉండకపోవచ్చు. ఒక్కోసారి ముందుగా పుల్ల తేన్పులు, వాంతులు, కడుపులో నొప్పిగా మొదలై ఒకట్రెండు రోజుల తర్వాత నీళ్ల విరేచనాలు కూడా మొదలవ్వచ్చు. చాలావరకు వైరల్, కొంతవరకు బ్యాక్టీరియాలు వదిలే విషపదార్థాలే డయేరియాకు కారణం. అరుదుగా కొన్ని రసాయనాలు, పాడైన నూనెలు, అతిగా మసాలాలు కూడా జీర్ణవ్యవస్థను ఇబ్బంది పెడతాయి. వర్షాలు, ముసిరే ఈగలు, కీటకాలు మోసుకొచ్చే వైరస్‌లు డయేరియాకు ప్రధాన కారణం. పిల్లల్లో డయేరియా ఎక్కువ ప్రమాదకరం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీళ్లలో కలిపి ఇవ్వడం ద్వారా నివారణ సాధ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

డయేరియాపట్ల అప్రమత్తంగా ఉండాలి: పృథ్వీచరణ్, హెల్త్ ఆఫీసర్, కాకినాడ నగరపాలక సంస్థ

వర్షాల నేపథ్యంలో నగరంలోని ప్రజలు డయేరియా, అంటువ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్ అన్నారు. పరిసరాలను ప్రతిఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో క్లీన్ చేసి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని గ్రామ సచివాలయ సిబ్బందిని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లకు సూచించారు. పారిశుధ్య పనులు చేపట్టి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, జూలై 5: జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2024 కోసం ఈనెల 15లోపు ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలను పంపించాలని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులంతా http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో ఉంచిన సూచనలు, అర్హతల ప్రకారం జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



మంత్రి సత్యకుమార్‌తో కాకినాడ ఎంపీ ఉదయ్

ప్రాణాలతో చెలగాటం!

» జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

- 7లో

ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధికి సహకరించండి

- వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కోరిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 5: గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంవల్ల వైద్యరంగం పూర్తిగా కుదేలైందని, దీన్ని అధిగమించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేయాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన అమరావతిలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ప్రభుత్వాస్పత్రులు, బోధన ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతోపాటు మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని కోరారు. కాకినాడ జీజీహెచ్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. జిల్లా పర్యటనకు విచ్చేయాలని మంత్రిని ఆహ్వానించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి జిల్లాలో వైద్యరంగాన్ని బలోపేతం చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు.



ప్రాణాలతో చెలగాటం!

జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

కరప, జూలై 5: విశాఖ జిల్లా భీమిలిలో గత నెల పెంపుడు కుక్క కరిచి 27ఏళ్ల భార్గవ్ మృతి చెందాడు. పెట్ డాగ్ కరవడంతో అతనికి రేబిస్ వ్యాధి సోకి చిన్నవయసులోనే చనిపోయాడు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక నాలుగు రోజుల వ్యవధిలో అతని తండ్రి కూడా తనువు చాలించాడు. ఆ ఇంట్లో ఇంతటి విషాదానికి కారణం ఒక పెంపుడు కుక్క. రేబిస్ వ్యాధితో అది చనిపోవడం.. అప్పటివరకు భార్గవ్ మేల్కోకపోవడం వల్ల ఆ కుటుంబానికి తీరని వేదన మిగిలింది. పెంపుడు జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల సరైన అవగాహన లేకపోవడం, వాటి పెంపకంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, సకాలంలో వ్యాక్సిన్‌లు వేయించకపోవడం తదితర కారణాల వల్ల సమాజంలో ఇటువంటి దారుణ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు (సంక్రమిత వ్యాధులు) అంటారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 200లకు పైగా జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తున్నట్టుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శనశాలల సిబ్బంది, పరిశోధనశాలల్లో పనిచేసే సిబ్బందికి ఈ జూనోటిక్ వ్యాధులు ఎక్కువగా సోకుతున్నాయి. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటిసారి 1885 జూలై 6వ తేదీన పిచ్చికుక్క కాటుకి గురైన ఒక వ్యక్తి ప్రాణాలను యాంటీ రేబిస్ టీకాతో కాపాడిన సందర్భంగా ఏటా ఈరోజును జూనోసిస్ డేగా నిర్వహిస్తున్నారు. జూనోటిక్ వ్యాధులను వైరస్, బ్యాక్టీరియల్, ప్యారసైటిక్ వ్యాధులుగా విభజించవచ్చు. వైరస్ వల్ల సంక్రమించే వ్యాధులలో రేబిస్, మెదడువాపు, బర్డ్ ఫ్లూ వంటివి ముఖ్యమైనవి. బ్యాక్టీరియా వల్ల బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోస్పైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం వంటి వ్యాధులు సోకుతాయి. పరాన్న జీవుల వల్ల సంక్రమించే ప్యారసైటిక్ వ్యాధుల్లో బద్దె పురుగులు, ఏలికపాములు, ఫైలేరియా, హైడాటిడ్ వంటివి ప్రముఖంగా చెప్పుకోవచ్చు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించుకుని అప్రమత్తతతో వ్యవహరిస్తే వాటి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

యజమానులు అప్రమత్తంగా ఉండాలి..

పెంపుడు జంతువుల యజమానులు వాటి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్రమత్తంగా ఉంటూ వాటి ప్రవర్తనలో తేడాలను గమనించాలి. రేబిస్ నివారణకు సకాలంలో టీకాలను వేయించాలి. అలాగే పశువైద్యుడు సూచించిన షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్‌లు ఇప్పించాలి. వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తరువాత చేతలను శుభ్రంగా కడుక్కోవాలి. పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూసుకోవాలి. పెంపుడు జంతువుల్లో అసాధారణ ప్రవర్తనలను గమనిస్తే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి.

పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

పాడిరైతులు తమ పశువులను సాకే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జంతు సమూహాల మధ్య కదిలేటప్పుడు పాదరక్షలు, రక్షిత దుస్తులు ఉపయోగించాలి. పశువుల శాలలు, పాలు పితికే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచాలి. పశువులకు క్రమంతప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. అనారోగ్యంతో ఉన్నవాటిని మంద నుంచి తప్పించాలి. జూనోటిక్ వ్యాధుల వ్యాప్తి, నివారణా చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలి.

సంపూర్ణ అవగాహనతో వ్యాధులు దూరం

సంపూర్ణ అవగాహనతో జూనోటిక్ వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. ఈ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. జంతు ఉత్పత్తులను పూర్తిగా వండడం, సురక్షితమైన ఆహార నిర్వహణ, సరైన రీతిలో నిల్వచేయడంపై దృష్టిసారించాలి. వ్యాధులను వ్యాప్తిచేసే కీటకాలు, ఎలుకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. రేబిస్ లక్షణాలు ఉన్న పెంపుడు జంతువు కరిస్తేనే కాకుండా వాటి చొంగ వల్ల సులభంగా రేబిస్ సోకుతుంది. పిచ్చికుక్కలు మనుషుల ముఖం మీద, పశువుల ముట్టి మీద కరిస్తే ప్రాణాపాయం తలెత్తకుండా వెంటనే ఇమ్యూనోగోబ్యులిన్స్ అనే టీకాను వేయించుకోవాలి.

సంక్రమణ వ్యాధుల నివారణకు చర్యలు



సంక్రమణ వ్యాధుల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. జూనోసిస్ డే సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో 1,500 డోసుల రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను సిద్ధంచేశాం. రేబిస్‌కు చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలను సమీప పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల వద్దకు తీసుకువచ్చి ఈ టీకా ఇప్పించాలి.

- డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు, పశుసంవర్ధకశాఖ ఏడీ, కరప ప్రాంతీయ పశువైద్యశాల



ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

వెల్లలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

- డీఎస్పీ పరిశీలన, డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం తనిఖీలు
- దోషులను కఠినంగా శిక్షించాలి : దళిత నాయకులు

ద్రాక్షారామ, జూలై 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద రోడ్డుపక్కన 9 ఏళ్ల కిందట సిమెంటు దిమ్మపై బాబూజగజ్జీవన్ రామ్, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి కిందపడేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో సచివాలయ సిబ్బంది విగ్రహం ధ్వంసంకావడం చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ఎస్ఐ సురేంద్రబాబు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్స్‌ను రప్పించారు. క్లూస్‌టీం సభ్యులు వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ద్రాక్షారామ ఎస్ఐ సురేంద్రబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో అశాంతి, అలజడి సృష్టించేందుకు అసాంఘిక శక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. సమాచారం తెలిసిన వెంటనే క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా సమాచారం తెలిసిన వెంటనే నియోజకవర్గానికి చెందిన దళిత, ప్రజా సంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసంచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎంపీపీ అంబ టి భవానీ, జనసేన నాయకుడు బుంగరాజు, టీడీపీ నాయకుడు రవ్వాభూషణం, వైసీపీ నాయకులు అంబటి తుకారాం, పోలినాటి ప్రసాద్, రైతుకూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమ శంకరం, పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్దూ డిమాండు చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ బి.రామకృష్ణ



వేద విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అస్వస్థతకు గురైన వేద పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శ

అన్నవరం, జూలై5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థులు డయేరియా బారినపడడంతో స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌తో కలసి పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. అస్వస్థతకు గురైన వారు కోలుకుంటున్న శివసదన్ కాటేజీలో మరింత మెరుగైన వైద్యం అందిస్తున్నారు. 17 మంది విద్యార్థులను వారంరోజులపాటు తమ ఇంటికి విద్యార్థుల తల్లిదండ్రులతో పంపించారు. పూర్తిగా కోలుకున్న తరువాత మిగిలిన వారిని పంపడం జరుగుతుందని అన్నారు. వేద పాఠశాల ఆవరణ, వాటర్‌ట్యాంక్‌లను పరిశుభ్రం చేస్తున్నారు. విద్యార్థులకు ఎమ్మెల్యే పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు వెన్నా శివ, పర్వత సురేష్, బద్ది రామారావు తదితరులు పాల్గొన్నారు.



మోసానికి పాల్పడిన కేటుగాడు ఇతడే

లీటరు డీజిల్ రూ.80కే

- ఓ రైతుకు 200 లీటర్లు పోయించిన దుండగుడు
- బంకు సిబ్బందిని నమ్మబలికి ఆపై సొమ్ములతో పరారీ
- నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో ఘటన

నల్లజర్ల, జూలై 5: కేటుగాళ్లు పెట్రోల్ బంకులను టార్గెట్ చేస్తున్నారు. మొన్న నల్లజర్ల పెట్రోల్ బంకు వద్దకు కారులో వచ్చి రూ.19 వేల డీజిల్ కొట్టించుకుని నకిలీ ఏటీఎం ఇచ్చి పరారైన సంఘటన మరువక ముందే గురువారం మరో ఘటన వెలుగు చూసింది. దమ్ముల సీజన్‌కావడంతో అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన రైతు కోడూరి భారత్ ట్రాక్టర్‌తోపాటు టిన్స్‌లో డీజిల్ కొట్టించుకోవడానికి బంకు వద్దకు వచ్చాడు. అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి తనకు జేసీబీ ఉందని, దానికి బిల్లు పెట్టుకోవడానికి లీటరు రూ.97 ఉన్న డీజిల్ రూ.80కే కొట్టిస్తా డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో భరత్ 200 లీటర్లు కొట్టించుకుని సదరు వ్యక్తికి రూ.16 వేలు ఇచ్చి వెళ్లిపోయాడు. బంకు సిబ్బందికి, తాను డబ్బులు మొత్తం ఇస్తానని, మరో రెండు టిన్‌లు ఉన్నాయని, వాటిలో కూడా నింపాలని ఆ వ్యక్తి బైక్‌పై పరారయ్యాడు. సదరు బంకు సిబ్బంది శుక్రవారం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

8న రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 : రాజమహేంద్రవరంలో ఈనెల 8వ తేదీన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి ప్రధాన అజెండాగా సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాల్గొంటారన్నారు. మాజీ సీఎం జగన్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

8న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా-2024

కార్పొరేషన్(కాకినాడ), జూలై 5: కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ గవర్నమెంట్ ఐటీఐలో ఈనెల 8న ఉదయం 9గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా-2024 నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ జీవీఎం వర్మ తెలిపారు. జిల్లాలో ప్రముఖ పరిశ్రమలనుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రంటీస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తారనన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో వివిధ ట్రేడ్లలో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌సీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్, సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలన్నారు.

8న జాబ్‌మేళా

కలెక్టరేట్(కాకినాడ), జూలై 5: ఈనెల 8న సోమవారం వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన శుక్రవారం విడుదల చేశారు. పట్టాభి ఆగ్రో ఫుడ్స్, శ్రీకాకోళేశ్వరి రిఫైనరీ అండ్ ఇండస్ట్రీ, అరబిందో ఫార్మాలో టెక్నీషియన్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ ప్రొడక్షన్, రాక్‌మెన్ ఇండస్ట్రీస్, డిక్సాన్ అండ్ హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 8న సోమవారం వికాస కార్యాలయం కాకినాడ కలెక్టరేట్‌వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376111 నెంబరును సంప్రదించాలన్నారు.



ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

అంతర్వేది హుండీల ఆదాయం రూ.46.11 లక్షలు

అంతర్వేది, జూలై 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ప్రధాన హుండీ ద్వారా రూ.44,47,752, గుర్రాలక్కమ్మ అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.26,572, అన్నదాన హుండీ ద్వారా రూ.1,09,888, మొత్తం 101 రోజులకుగాను హుండీల ద్వారా రూ.46,11,212 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.19,452 వచ్చిందన్నారు. దేవదాయశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సూపరింటెండెంట్ విజయసారథి, ఈవో బొక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లోవలో హుండీల ఆదాయం రూ.35 లక్షలు

తునిరూరల్, జూలై5: లోవ దేవస్థానంలో అధికారులు హుండీలు లెక్కించారు. రూ.35,46,802 నగదు, 0.87 మిల్లీ గ్రాముల బంగారం, 3.200 కిలోల వెండి వచ్చినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొనగా జగన్నాథపురం గ్రూప్ టెంపుల్స్ అధికారి వద్దారి సత్యనారాయణ, సిరిపురం గ్రూప్ టెంపుల్స్ అధికారి సూర్యామణి లెక్కింపులో ప్రత్యేకాధికారులుగా పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రెండు లక్షల విరాళం

అన్నవరం, జూలై 5: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కాకినాడకు చెందిన అన్యం రాములు, సావిత్రమ్మ దంపతులు 1,00,116, కట్టిరెడ్డి లక్ష్మణరావు, నాగరత్నం దంపతులు పేరున 1,00,116 విరాళంగా సమర్పించారు. దాతలు ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా, వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

అమరావతి రాజధాని నిర్మాణానికి కవల విద్యార్థినుల విరాళం

దాచుకున్న రూ.9999 సొమ్మును ఎమ్మెల్యేకు అందజేత



రాజధాని నిర్మాణానికి చిన్నారులు దాచుకున్న సొమ్మును ఎమ్మెల్యేకు అందిస్తున్న దృశ్యం

అంబాజీపేట, జూలై 5: తాము దాచుకున్న సొమ్మును కవల విద్యార్థినులు ఏపీ రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి విరాళంగా అందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని కొర్లపాటిపాలానికి చెందిన యర్రంశెట్టి చిత్రహర్షిణి, చిత్రవర్షిణి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నారు. తండ్రి నాగబాబు ఇచ్చిన డబ్బులను దాచుకున్న ఆ విద్యార్థినులు మొత్తం రూ.9,999ను స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు రాజధాని నిమిత్తం అందించారు. చిన్నారుల తాతయ్య యర్రంశెట్టి పాండురంగారావు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆదేస్ఫూర్తితో ఆయన మనమరాళ్లు విరాళం ఇవ్వడంపై పలువురు వారి దాతృత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.సరోవర్, తహశీల్దారు విమలకుమారి, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్‌ఎం కె.సాయిరాం పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై కత్తితో దాడి : నిందితుడికి రిమాండ్

గోకవరం, జూలై 5: మతిస్థిమితం లేని మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవీపట్నం మండలం సీతారం గ్రామానికి చెందిన ఈక సుబ్బలక్ష్మి బీఈడీ వరకు చదువుకుంది. సుమారు ఐదేళ్ల కిందట తల్లిదండ్రులు మృతి చెందడంతో అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి బాగోలేదు. శుక్రవారం తెల్లవారుజామున ఆమె గోకవరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా గోకవరం గ్రామానికి చెందిన ఎడ్ల సూరిబాబు వెళ్లి మద్యం తాగేందుకు డబ్బులుగానీ, బంగారంగానీ ఇవ్వాలని కత్తితో బెదిరించాడు. దీంతో సుబ్బలక్ష్మి అతని నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా చేతిలో ఉన్న చాకుతో కుడి చెయ్యి, కుడి బుగ్గపై గాయపర్చాడు. ఈ ఘటనపై బాధితురాలి సోదరుడు ఈక రాంబాబు ఫిర్యాదు మేరకు సూరిబాబుపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా నిందితుడికి 15 రోజులు రిమాండు విధించినట్టు ఎస్ఐ కూన నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రాజవొమ్మంగి జూలై 5: జడ్డంగి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం జడ్డంగి గ్రామానికి చెందిన ఒడ్డు రాంబాబు అనే వ్యక్తి జడ్డంగి నుంచి రాజవొమ్మంగి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును గమనించకుండా ముందుకు వెళ్లడంతో మట్టి దిమ్మను ఢీ కొనడంతో దూరంగా ఎగిరిపడ్డాడు. రాంబాబు పడిన ప్రాంతంలో గాజు సీసా పెంకులు ఉండడంతో అవి ముఖానికి గుచ్చుకొని రాంబాబు గాయపడ్డాడు. పోలీసులు క్షతగాత్రుడిని జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గోరంట్లకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న ఈవో

సత్యదేవుడి సన్నిధిలో ఎమ్మెల్యే గోరంట్ల పూజలు

అన్నవరం, జూలై 5: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి శుక్రవారం విచ్చేసిన రాజమహేంద్రవరం రూరల్ సీనియర్ శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం ఎమ్మెల్యే గోరంట్లకు వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

11వ పీఆర్సీలో మోసం చేసిన జగన్‌కు 11 సీట్లే

- ప్రభుత్వ పాఠశాలలకే 'తల్లికి వందనం' ఇవ్వాలి
- జీవో నెం.117 తక్షణం రద్దుచేయాలి
- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

అమలాపురంటౌన్, జూలై5: ప్రాథమిక విద్యారంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎస్టీయూ రాష్ట్రఅధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ విమర్శించారు. జగన్ తుగ్లక్ పాలనతో మొత్తం విద్యారంగమే నిర్వీర్యమైందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 11వ పీఆర్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసంచేసిన జగన్‌కు రాష్ట్ర ప్రజలు 11 సీట్లే కేటాయించారని ఎద్దేవా చేశారు. ఎస్టీయూ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.117 విద్యారంగానికి తీరని నష్టం చేకూర్చిందన్నారు. దాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా పల్లె బడులు మూతపడే ప్రమాదం ఏర్పడిందన్నారు. 1, 2 తరగతుల్లో అడ్మిషన్లు తగ్గిపోయాయన్నారు. నాటి ప్రభుత్వ జీవోతో ఒక్కో ఉపాధ్యాయుడు 42 పీరియడ్లు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడడంతోపాటు నాన్ టీచింగ్ యాక్టివిటీలు పెరిగిపోయాయన్నారు. టాయిలెట్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి ఎన్నో యాప్‌లను ఉపాధ్యాయులే చూడాల్సిన పరిస్థితి నుంచి బయటపడేలా ప్రతి ఉన్నత పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరుతూ ఇప్పటికే విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందించామన్నారు. గత ప్రభుత్వం పరీక్షా విధానాన్ని సైతం లోపభూయిష్టంగా మార్చేసిందన్నారు. సీబీఎస్ఈ, ఎన్‌సీఆర్టీ, ఐబీ సిలబస్ అంటూ మాతృభాషకు తీరని అన్యాయం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. విద్యార్థులు ఏ సిలబస్‌లో చదవాలో తెలియని అయోమయ పరిస్థితి కల్పించారన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు రూ.25 వేల కోట్లకు పెంచేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని, అప్పుడే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అవుతుందన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతోపాటు ఐఆర్ ప్రకటించాలని లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నాటి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉద్యమించిన ఉపాధ్యాయులపై కేసులు పెట్టడంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, వారికి మోక్షం కల్పించాలని కోరామన్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయడంతోపాటు 1998, 2008 ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని కోరామన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, అభయ్ కన్వీనర్ రాపాక ప్రసాద్, స్టేట్ కౌన్సిలర్ బోనం గంగాధర్ పాల్గొన్నారు.





బాధితులతో కలిసి ఆందోళన చేస్తున్న బత్తుల.. ఎమ్మెల్యేకు హామీ పత్రం ఇస్తున్న బ్యాంకు అధికారులు

జి.యర్రంపాలెంలో డ్వాక్రా మహిళల ఆందోళన

ఎమ్మెల్యే బత్తుల సంఘీభావం

దివాన్‌చెరువు, జూలై5: రాజానగరం మండలం జి.యర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడా బిజినెస్ కరస్పాండెంట్ తమను దగా చేశాడని న్యాయం చేయాలంటూ బాధిత మహిళలు శుక్రవారం బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్దసంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆందోళనకారుల వద్దకు చేరుకుని వారికి మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. బ్యాంకు, డీఆర్‌డీఏ అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకులో రెండేళ్లుగా మోసం జరుగుతోందని, డ్వాక్రా మహిళలు బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌కు సొమ్ము చెల్లించేవారన్నారు. ఆ సొమ్ము తీసుకుని బీసీ స్టాంప్ వేసి రిఫరెన్స్ నెంబర్ నమోదు చేసి రశీదు ఇచ్చేవారని, వాటిని డ్వాక్రా మహిళలు నమ్మి భద్రపర్చుకున్నారన్నారు. పాసుబుక్ ఎంట్రీలు వేసి ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా బ్యాంకు సిబ్బంది ఏవో సాకులు చెప్పి కాలయాపన చేశారన్నారు. బీసీకి సొమ్ము చెల్లించిన విషయం బ్యాంకు సిబ్బందికి, యానిమేటర్‌కు కూడా తెలుసని చెప్పారు. జి.యర్రంపాలెంతోపాటు కొండగుంటూరు, సంపత్‌నగరం, పుణ్యక్షేత్రం గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలు, అలాగే బంగారు పంట రుణాలకు సంబంధించి రూ.57,70,950 దుర్వినియోగం చేసినట్టు ఇంతవరకు పరిశీలనలో తేలిందన్నారు. ఇంకా జి.యర్రంపాలెంలోని 17 డ్వాక్రా సంఘాలకు సంబంధించిన లావాదేవీలను పరిశీలిస్తున్నారన్నారు. అనధికారికంగా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు స్కామ్ జరిగినట్టు తెలుస్తోందన్నారు. తమ ఆందోళనతో దిగివచ్చిన బ్యాంకు ఉన్నతాధికారులు 45 రోజుల్లో బాధితులకు సొమ్ము చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా తెలిపారన్నారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తోరాటి శ్రీను, మద్దిరెడ్డి చినవెంకటేశ్వరరావు, బాబులు, పేపకాయల విష్ణుమూర్తి, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, డీపీడీ జనార్దన్, ఏపీఎం హేమ, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ పి.కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి'

తాళ్లరేవు, జూలై 5: మహిళలు, బాలికలపై జరుగుతున్న హత్యారాలు దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అన్నారు. శుక్రవారం భీమాబాయి మహిళా మండల కార్యాలయంలో జండర్ ఆధారిత హింస, మహిళలు చిన్నారులపై జరుగుతున్న హింసలకు వ్యతిరేకంగా గ్రామసమాఖ్య సభ్యులకు నిర్వహించిన అర్ధసంవత్సరం శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ప్రోగ్రాం ఆర్గనైజర్ న్యాయవాది వాసంశెట్టి మోహన్ జాన్సీ, గ్రామమహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావుకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు, టీడీపీ నేతలు

శిలాఫలకాలు తొలగించిన వారిపై

చర్యలు తీసుకోవాలి

● టీడీపీ నేతలు డిమాండ్

పిఠాపురం, జూలై 5: పిఠాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీఎస్ఎన్ వర్మ ఎమ్మెల్యేగా ఉండగా శంకు స్థాపన చేసిన శిలాఫలకాలను దుండగులు తొలగించారని, వీటిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నేతలు శుక్రవారం పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలో మునిసిపల్ కమిషనరు ఎస్.కనకారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇవన్నీ పథకం ప్రకారమే చేశారని, ఎవరి ఒత్తిడి మేరకు వీటిని తొలగించారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. సీసీ కెమేరాల పుటేజీలు తీయించి దోషులను గుర్తించాలన్నారు. మునిసిపల్ కార్యాలయం ప్రధాన గేటు ఎడమవైపుగల శిలాఫలకాన్ని ఇటీవల తొలగించారని, దీనిపై విచారణ జరిపించాలన్నారు. తొలగించిన శిలాఫలకాన్ని యథాస్థానంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. వర్మ పేరు కనబడకూదని గత పాలకులు చేస్తున్న దుర్మార్గపు ఆలోచన అని ఆరోపించారు. కార్యక్రయంలో టీడీపీ నేతలు, కౌన్సిలర్లు కొండేపూడి సూర్యప్రకాష్, అల్లవరపు నగేష్, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీనివాస్, పంపనబోయిన అన్నపూర్ణ, రాయుడు శ్రీను, పిల్లి చిన్నా, అద్దూరి శ్రీను, కర్నాసుల రాజా, అందుగుల సత్తిబాబు, పద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్

గొల్లప్రోలు రూరల్, జూలై 5: ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కారం లభిస్తుందని జనసేనపార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రజాసమస్యలు, పిఠాపురం అభివృద్ధిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్దిష్ట ప్రణాళికతో ఉన్నారని చెప్పారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడురోజుల పర్యటనలో భాగంగా పవన్‌కల్యాణ్ ప్రజల సమస్యలను తెలుసుకున్నారని, అధికారులతో సమావేశాలు నిర్వహించి వాటిపై అధ్యయనం చేశారన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వనున్నారని తెలిపారు. ఇప్పటికే దీనిపై దృష్టిసారించారని చెప్పారు. సముద్రపు కోత ప్రాంతాలను స్వయంగా పరిశీలించడంతోపాటు నిపుణులతో చర్చించారని తెలిపారు. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ గల సముద్ర తీర ప్రాంతాన్ని విశాఖ ఆర్కే బీచ్ మాదిరిగా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో పర్యావరణానికి హాని కలిగించని పరిశ్రమల స్థాపనకు పవన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఆ దిశగా కార్యాచరణ ప్రారంభమైందని చెప్పారు. సమావేశంలో జనసేన ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, కడారి తమ్మయ్య నాయుడు, పిల్లా శివశంకర్, సూరవరపు సురేష్, ఓదూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాడలో కొనసాగుతున్న ఉద్రిక్తత

గొల్లప్రోలురూరల్, జూలై 5: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రా మంలో ఉద్రిక్తత పరిస్థితి కొనసాగుతున్నది. గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీలోని వ్యక్తులు చింపివేయడంతో వివాదం ఏర్పడి ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ షేక్ జాన్‌భాషాలు గ్రామంలో పర్యటించి వారితో చర్చలు జరిపారు. గ్రామానికి చెందిన శివకోటి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మాగాపు శివతో పాటు మరికొందరు ర్యాలీ నిర్వహిస్తూ అంబేద్కర్ ఫ్లెక్సీని చింపడంతోపాటు తన ఇంటిపై మద్యం బాటిళ్లు విసిరారని శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. కాగా గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసుపికెట్ ఏర్పాటు చేశారు.

విద్యుత్ భద్రతపై అవగాహనతో ప్రమాదాల నివారణ



బహుమతి అందిస్తున్న విద్యుత్తుశాఖ తనిఖీ అధికారి శాంతారావు

సర్పవరంజంక్షన్, జూలై 5: విద్యుత్ వినియోగదారుల్లో భద్రతపై అవగాహన పెంచడం ద్వారా విద్యుత్ ఆదాతో పాటూ ప్రమాదాలు నివారించవచ్చని విద్యుత్ శాఖ తనిఖీ అధికారి శాంతారావు అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం పురస్కరించుకుని శుక్రవారం వాకలపూడి కోరమండల్ ఎరువుల కర్మాగారంలో విద్యుత్ భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, కర్మాగారాల్లో విద్యుత్ భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కోరమండల్ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ పద్మనాభం మాట్లాడుతూ విద్యుత్ భద్రతా వారోత్సవాలు వారంరోజులుగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ భద్రతపై నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన ఉద్యోగులు, సిబ్బందికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెయింటెనెన్స్ హెడ్‌కమల్, ఎలక్ట్రికల్ మేనేజర్ సుబ్బరాజు, ఇంజనీర్స్ చైతన్య, సిద్ధార్థ, సర్వేశ్వరరావు, వివేక్, మణికంఠ పాల్గొన్నారు.

దివ్యాంగులకు 'ఉమా' సంస్థ సేవలు అభినందనీయం



దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు అందించిన ఆయిల్ ఇండియా ఈడీ అంజన్‌జ్యోతి ప్రఖాన్

సర్పవరం జంక్షన్, జూలై 5: దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక విద్య, సమీకృత వృత్తి విద్య, శిక్షణ అందిస్తూ జీవనోపాధి, పునరావాసానికి విశేష తోడ్పాటు అందిస్తున్న ఉమా సంస్థ సేవలు అభినందనీయమని ఆయిల్ ఇండియా లిమిటెడ్, కేజీ బేసిన్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంజన్‌జ్యోతి ఫుఖాన్ అన్నారు. శుక్రవారం వాకలపూడిలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ (ఉమా మనోవికాస కేంద్రం) సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ ఇండియా లిమిటెడ్ సీఎస్‌ఆర్ నిధులు రూ.4.83లక్షల విలువచేసే కృత్రిమ పరికరాలను 36 మంది దివ్యాంగులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అవసరాలు గుర్తించి వీరి జీవనోపాధి,అభ్యున్నతికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పి రెడ్డి విశేష సేవలు అందిస్తున్నారన్నారు. పేద, విభిన్న ప్రతిభావంతులకు సరైన ప్రోత్సాహం, భరోసా కల్పిస్తే భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి అన్నారు. కృత్రిమ పరికరాలు అందించిన ఆయిల్ ఇండియా, కేజీ బేసిన్ ప్రాజెక్టు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డ్రిల్లింగ్ సీజీఎం సంజీవ్ గొగ్రై, గోదావరి లేడీస్ క్లబ్ మాజీ సెక్రటరీ రాఖీ గొగ్రై, టీం సభ్యులు కె నారాయణరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన

జగ్గంపేట, జూలై 5: మార్కెట్ కమిటీ సమావేశపు హాలులో చిరుధాన్యాల సాగుపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసా యాధికారి ఎస్.విజయకుమార్ హాజరయ్యారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు కొర్రలు, రాగి, సామ, ఊరిక, ఊదలు, అండుకొర్రలు సాగు చేయాలని చెప్పారు. ఈ పంటలకు తక్కువ నీటితో ఎక్కువ లాభాలు వస్తాయన్నారు. రైతుల అవసరాల మేరకు వాటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో పొలంబడి ఆర్పీ బాబూరావు, ఏడీఏ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించిన ప్రజలకు అభివృద్ధిని అంకితమివ్వాలి

● ఐక్య సంఘం సహకారంతోనే ఈస్థాయికి

● వైసీపీ నేత చేరిక సందర్భంగా యనమల



యనమల సమక్షంలో టీడీపీలో చేరిన మాకినీడి గాంధీ

తొండంగి, జూలై 5: ఓట్లేసి ఆదరించిన ప్రజలకు అభివృద్ధిని అంకితమిచ్చి కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం కృష్ణాపురంలో వైసీపీ రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి మాకినీడి గాంధీ యనమల సమక్షంలో టీడీపీలో చేరారు. గాంధీ ఆయన అనుచరులు ఇంటి బాబులు, గొల్లపల్లి అచ్చారావు, మాకినీడి అప్పారావు, నాని తదితరులకు యనమల పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా ఏర్పడిన ఐక్యసంఘం కృషి, పంతం పద్మనాభం సహకారం వలన తాను ఈస్థాయికి చేరానన్నారు. అప్పటి ఐక్య సంఘం సభ్యుడైన గాంధీ తాను రాజకీయాల్లోకి రావడానికి తగిన ప్రోత్సాహం అందించారన్నారు. రాజకీయాలంటే తెలియని తనకు ఎన్టీఆర్, చంద్రబాబు ప్రోత్సాహంతో అనేక పదవులు లభించాయన్నారు.వాటిని నిలబెట్టుకుని ప్రజలకు సేవచేసే అవకాశం తనకి దక్కిందన్నారు. అప్పటి ఐక్య సంఘ సభ్యులైన గాంధీ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారని వివిధ కారణాలతో పార్టీకి దూరంగా ఉన్న గాంధీ, అచ్చియ్యనాయుడు, తదితరులు తిరిగి పార్టీలోకి రావడం అభినందనీయమన్నారు. గాంధీ మాట్లాడుతూ రాష్ట్రంలో రామకృష్ణుడు పొందినన్ని పదవులు మరేనేత పొందలేదని వాటికి వన్నెతెచ్చిన నేత యనమలని కొనియాడారు. దివ్య తనబిడ్డ వంటిదని ఆమెకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గొర్లె అచ్చిన్నాయుడు, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, జిల్లా మత్స్యకార సంఘం అధ్య క్షుడు కోడ వెంకటరమణ, కొయ్యా శ్రీను, బంటుపల్లి అన్వేష్, దూలంమురళి, వెన్నాబాబులు. మాకినీడి భారతి, అరిగెల నర్సింహమూర్తి కొయ్యా రామకేశవ పాల్గొన్నారు.

అధికారులతో యనమల సమీక్ష



స్థానిక నాయకులతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న యనమల

తునిరూరల్, జూలై 5: తుని పట్టణ సుందరీకరణ, ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివద్ధి పనులు వంటి ప్రధాన అంశాలపై శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తేటగుంటలో ఎమ్మెల్యే కార్యాలయంలో, మున్సిపల్, రెవెన్యూ మండల పరిషత్ అధికారులతో యనమల సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ ఆదాయ, వ్యయాలు, పెండింగ్ బిల్లులు, చెల్లింపులు, శానిటేషన్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వంటి అంశాలు కూలం కుషంగా రివ్యూ చేసి పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, మళ్ల గణేష్, సుర్ల లోవరాజులతో కలిసి సమీక్షించారు. శానిటేషన్ విషయంలో అలసత్వం చూపవద్దని సూచించిన ఎమ్మెల్యే సిబ్బంది కొరత ఉంటే రొటేషన్ విధానాన్ని అమలుచేయాలని సూచించారు. పట్టణ సుందరీకరణకు పాధ్రాన్యం ఇవ్వాలని, గొల్లఅప్పారావు సెంటర్‌లో అల్లూరి, ఎన్టీఆర్ విగ్రహాలను అక్కడే మరొక చోట ఆవిష్కరించాలని రాజా అశోక్‌బాబు సూచనలను అధికారులు పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. డంపింగ్ యార్డు పాత ప్రతిపాదనలపై యనమల సమీక్షించారు. అనంతరం కుడా అధికారులతో సమీక్షించిన ఆయన నియోజకవర్గం నుంచి ఏటా కుడాకు వెళుతున్న ఆదాయం నియోజకవర్గంలో కుడా చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తేటగుంటలో చెరువుగట్టుపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం కాగా వాటికి రూ.10లక్షలు నిధులు ఖర్చు చేసినట్లు తెలపడంపై అరా తీయగా పనులు చేపట్టకుండా వైసీపీ నాయకులు నిధులు కాజేసిన ఉదంతం బయట పడింది. దీంతో సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని యనమల సూచించారు. ఈ సమీక్షలో కుడా అధికారులు వీసీ సుబ్బారావు, డీఈ రామారావు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, తహసీల్దార్ భరత్, ఎంపీడీవో, అధికారులు ఉన్నారు.

విద్యాప్రమాణాలు పెంచండి: డీఈవో

కోటనందూరు, జూలై5: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. శుక్రవారం కోటనందూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేటు విద్యాసంస్థలకు దీటుగా బోధన అందించాలన్నారు. ఇప్పటికే మారుతున్న కాలానుగుణంగా మంచి బోధనఇవ్వాలన్నారు. అనంతరం రెండు గంటలపాటు ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేవం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనపథకం వివరాలు అడిగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎ.శ్రీనివాస్, ఎం.రామశేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనంచేస్తున్న ఏడీ నాగేశ్వరరావు

నాణ్యతగా మధ్యాహ్న భోజనం అందించాలి

కరప, జూలై 5: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని జిల్లా విద్యాశాఖ ప్రభుత్వ పథకాల ఏడీ పడాల నాగేశ్వరరావు సూచించారు. గురజనాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం వంటకాలను రుచికరంగా చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించారు. హెచ్ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ నాగలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారులచే పాఠశాలల తనిఖీ

సామర్లకోట, జూలై 5: సామర్లకోట మండలంలో ప్రభు త్వ పాఠశాలల నిర్వహణ తీరుపై సామర్లకోట మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్యలు పలు పాఠశాలలను శుక్రవారం తనిఖీలు చేశారు. మండలంలోని ఉండూరు ప్రకాశరావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శివరామ కృష్ణయ్య సందర్శించి విద్యార్థుల నమోదు లు పరిశీలించారు. ఇంకా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషిచేయాలన్నారు. ప్రతీ పాఠశాలలోనూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా ప్రధా నోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. డయేరియా వంటి అంటువ్యాధులు ప్రభలకుండా తీసుకో వాల్సిన జాగ్ర త్తలను ఎంఈవో శివరామ కృష్ణయ్య వివరించారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించేలా చర్యలు తీసుకో వాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కాపవరం పాఠశాలను ఎంఈవో-2 పి.పుల్లయ్య శుక్రవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.



విద్యార్థులతో ఎంఈవో-2 పుల్లయ్య

'ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేయండి'



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 5: ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలను తక్షణమే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు స్థల యజమానులను కోరారు. అలా చేయకపోతే జరిమానా విధించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గొడారిగుంట, డీమార్ట్, జయేంద్రనగర్, లక్ష్మీహాస్పటల్ ప్రాంతాల్లో డీ-సిల్టేషన్ పనులను తనిఖీ చేశారు. అక్కడికి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పూడికతీత పనులను రానున్న నెలరోజుల్లో కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచు కుని మెరుగైన పారిశుధ్య నిర్వహణకోసం నగరపాలకసంస్థ చేస్తున్న సేవలకు ప్రజలు కూడా తమ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే స్థలాను ఎత్తుచేసి నీరు నిల్వ ఉండకుండా చదును చేసుకోవాలన్నారు. స్థల యజమానులు సహకరించకుంటే పారిశుధ్యపరమైన చట్ట ఉల్లంఘన కింద నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్ ఉన్నారు.

నగర సుందరీకరణకు సహకరించండి

● కార్పొరేట్ సంస్థలకు కమిషనర్ వినతి

కార్పొరేషన్(కాకినాడ), జూలై 5: నగర సుందరీకరణకు కార్పొరేట్ సంస్థలు తోడ్పాటును అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుతో కలిసి నగరపాలకసంస్థ కార్యాలయంలో ఓఎన్జీసీ, ఎన్ఎఫ్‌సీఎల్, కేఎస్‌పీఎల్ వంటి కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సామర్లకోట రోడ్డు, అక్షర స్కూల్ రోడ్డు సహా పలు ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా ఇళ్లలోని చెత్తను, చిరు వ్యాపారులు కొబ్బరిబొండాల వ్యర్థాలను వేస్తున్నారన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయన్నారు. ఇకపై అలాంటి ముఖ్యప్రాంతాల్లో చెత్తను డంప్ చేసే అవకాశం లేకుండా అక్కడ ఫెన్సింగ్ వేసి మొక్కలు నాటి సుందరీకరణ చేయాలని సంకల్పిస్తున్నామన్నారు. ఇందుకు ఆయా కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్‌ఆర్ నిధుల ద్వారా అవసరమైన తోడ్పాటునందించాలని కమిషనర్ కోరారు. కమిషనర్ ప్రతిపాదనపై సమావేశానికి హాజరైన ఆయా సంస్థల ప్రతినిధులు కూడా సానుకూలంగా స్పందించారు. ఆల్‌ఈజ్‌వెల్, ధరిత్రి వంటి సంస్థలు కూడా నగర వాతావరణాన్ని పచ్చదనంతో ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేలా మొక్కలు నాటే ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఏఈ వై.నాగేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఆయా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'కౌలు కార్డులపై రైతులకు అవగాహన కల్పించాలి'

ఏలేశ్వరం, జూలై 5: రైతులకు కౌలు కార్డులపై అవగాహన కల్పించాలని ఆర్డీవో జె.సీతారామరాజు రెవె న్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తహశీల్దార్ రంగారావు ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆర్డీవో సీతారామరాజు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోనూ కౌలు రైతు దారులకు కౌలు కార్డులకు, సుమోటో కుల ధ్రువీకరణ పత్రాలు ప్రక్రియను వేగవంతం చేయాలని మండల అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతీఒక్కరికీ కుల ధ్రువీకరణ పత్రం, కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి బి.జ్యోతి, డిప్యూటీ తహశీల్దార్ గంధం రవి, రెవెన్యూ అధికారులు అవసరాల కిషోర్, రొంగల శ్రీను, కె.సత్యారావు, చిన్నారి, శ్యామల, తిరుపతమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న ఆర్డీవో సీతారామారావు

నేడు జూనోసిస్ దినోత్సవం

సామర్లకోట, జూలై 5: పశువుల నుంచి మనుష్యులకు సంక్రమించే వ్యాధుల (జూనోసిస్) నివారణ దినోత్సవం సందర్భంగా సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో ప్రతీఏటా నిర్వహిస్తున్న రీతిలోనే ఈనెల 6న శనివారం సామర్లకోట ప్రభుత్వ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్లను ఉచితంగా అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, రీజియన్ ఛైరపర్సన్ చిత్తులూరి శ్రీదేవిలు తెలిపారు.ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబులు ముఖ్యఅతిథులుగా హాజరై ఏఆర్‌వీ వ్యాక్సిన్‌ను ఆవిష్కరించి టీకాల కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు.

తుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

● తుని ఎమ్మెల్యే యనమల దివ్య



మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తునిరూరల్, జూలై 5: తుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలంటూ తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఐటీ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. సచివాలయంలో మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆమె నియోజకవర్గ పరిస్థితులు వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానన్నారని యనమల దివ్య తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన సచివాలయ ఉద్యోగులు

జగ్గంపేట, జూలై 5: జగ్గంపేట మండలంలో బీఎల్‌వోలుగా పనిచేస్తున్న వివిధ గ్రామాల సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం తహసీల్దార్‌ని కలిసి బీఎల్‌వోల గౌరవ వేతనం గురించి వినతిపత్రం ఇచ్చారు. గత మూడు సంవత్సరాలుగా బీఎల్వోలుగా పనిచేసిన ఉద్యోగులు ఎవరికీ గౌరవవేతనం అందలేదన్నారు.

ఈఎస్ఐ హాస్పటల్ తనిఖీ

జగ్గంపేట, జూలై 5: కాకినాడలో గల ఈఎస్ఐ హాస్పటల్‌ను కాకినాడ ఎంపీ తంగిళ్ళ ఉదయ శ్రీనివాస్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ తనిఖీ చేశారు. హాస్పటల్‌లోని మౌలిక వసతులు, సదుపాయాలు సంబంధించి సమస్యలను అడిగి తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

దేవిరెడ్డి మణికంఠకు జనసేన ఇన్‌చార్జ్ పరామర్శ

జగ్గంపేట, జూలై 5: జగ్గంపేట నియోజకవర్గంలో జగ్గంపేట టౌన్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన దేవి రెడ్డి మణికంఠను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. ఆయన వెంట మాదారపు వీరబాబు, మేక వీరబాబు, బుదిరెడ్డి శ్రీనివాస్, గవర సుధాకర్, జగ్గంపేట నరేస్, పాలెం బాబి, సత్యంశెట్ట గణేష్ ఉన్నారు.

టీడీపీ వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రత్తిపాడు, జూలై 5: ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా వాణిజ్యవిభాగ అధ్యక్షుడు ఇంధన ఏసుబాబును శుక్రవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పరామర్శించారు. ధర్మవరంలోని ఇంధన నివాసానికి విచ్చేసి ఆమె ఏసు బాబు ప్రమాదంలో కాలువిరిగి గాయపడిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు కొమ్మల కన్నబాబు, యాళ్ళ జగదీష్, బొల్లు కొండబాబు, డాక్టర్ రఘురాం తదితరులు ఉన్నారు. అనంతరం రఘురామ క్లాత్ అధినేత ఇంధన బాబ్జి, కుటుంబీకులు ఎమ్మెల్యే సత్యప్రభను శాలువా కప్పి అభినందించారు.

సాగునీటి సమస్యకు పరిష్కారం : జనసేన నేత సందీప్


కరప, జూలై 5: ఎమ్మెల్యే పంతం నానాజీ చొరవతో మండలంలోని ఆయకట్టుకు సాగునీటి సమస్యను పరిష్కరించినట్టుగా జనసేన యువనేత పంతం సందీప్ తెలిపారు. కూరాడ వద్ద సంపరబోది పంటకాలువ పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎమ్మెల్యే స్పందించి సొంత నిధులతో మండలంలోని అనేక పంట, మురుగు కాలువల పూడికతీత పనులకు నడుం బిగించారన్నారు. గడిచిన 20రోజులుగా మిషన్‌లతో సుమారు 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే కాలువలను బాగుచేయించామన్నారు. దీంతో ఖరీఫ్ సీజన్‌ను రైతులు ఆశాభావంతో ప్రారంభించారని పేర్కొన్నారు.

పెనుగుదురు వినియోగదారులకు శుభవార్త

● జూలై నెల కేబుల్ ఉచితం

కరప, జూలై 5: ఇచ్చిన మాటకు కట్టుబడి ఒక కేబుల్ ఆపరేటర్ ఒకనెల కేబుల్ బిల్లును కట్టనవసరం లేదంటూ వినియోగదారులకు శుభవార్త చెప్పాడు. కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెం దిన పట్నీనీడి హరిబాబు స్థానికంగా శ్రీహరి కేబుల్ నెట్‌వర్క్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఇటీవలె జరిగిన ఎన్నికల్లో కాకినాడరూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించాడు. నానాజీ గెలిస్తే ఒకనెల పాటు ఉచితంగా కేబుల్ ప్రసారాలను అందిస్తానని హామీ ఇచ్చాడు. నానాజీ గెలవడంతో ఇచ్చినమాట ప్రకారం జూలై నెలలో ఎవరూ కేబుల్ బిల్లు కట్టక్కర్లేదంటూ గ్రామంలో పలుచోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాడు. గ్రామంలోని వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు



పెద్దాపురం, జూలై 5: కోరిన కోర్కెలను తీర్చే ఇల వేల్పుగా భక్తులు భావించే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మ వారిని ప్రత్యేకాలంకరణలో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త చింతపల్లి బ్రహ్మాజీ, కార్యనిర్వహణాధికారి చేబ్రోలు రామ్మోహనరావుల ఆధ్వర్యంలో వేదపండితులు వేద మం త్రోచ్చారణల మధ్య అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు.

మరిడమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం



పిఠాపురంలో మరిడమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పిఠాపురం, జూలై 5: పిఠాపురం మునిసిపల్ మార్కెట్ సమీపంలో ఉన్న మరిడమ్మ తల్లివారి జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నెలరోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారిని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సోదరుడు రవివర్మ, టీడీపీ పట్టణ కన్వీనర్ కొండేపూడి సూర్యప్రకాష్, కోళ్ల బంగారుబాబు, సోము సత్యనారాయణ, తదితరులు దర్శించుకున్నారు.

అన్నవరంలో ఘనంగా మరిడమ్మ జాతర



మరిడమ్మ ఆలయంలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, జూలై 5: గ్రామంలో స్టేషన్‌రోడ్డులో ఉన్న మరిడమ్మ ఆలయంలో శుక్రవారం జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అన్నవరం పరిసర ప్రాంతాలనుంచి స్థానిక వెలంపేట మహిళలు అమ్మవారికి నైవేద్యాలు అందించి సారె, చీరలను సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమి టీ ఏర్పాట్లుచేశారు. సాయంత్రం 5గంటల నుంచి గ్రామంలో వివిధ దేవతామూర్తుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవ ఊరేగింపు జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్నవరం ఎస్.ఐ కిషోర్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ, ప్రత్యంగిర హోమాలు

అన్నవరం, జూలై 5: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం, అమావాస్య రావడంతో చండీ, ప్రత్యంగిర హోమాలు ఏకకాలంలో నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి పారాయణలు, జపములు, హోమాలు నిర్వహించారు. 12 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అ ర్పిం చి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డిగ్రీలో ప్రవేశానికి పదిలోపు దరఖాస్తు చేసుకోవాలి

తొండంగి, జూలై5: పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు తమ దరఖాస్తులను గడువులోపు అందించాలన్నారు.

'పట్టణాభివృద్ధికి సమిష్టి కృషి'

ఏలేశ్వరం, జూలై 5: పట్టణాభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు అన్నారు. శుక్రవారం విజయఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ. 3లక్షల వ్యయంతో 8, 9, 19వ వార్డుల్లో అప్పన్నపాలెం, ఎరుకల వీధుల్లో ఏర్పాటుచేసిన చేతి పంపులను జనసేన ఇన్‌చార్జ్ తమ్మయ్యబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య, ఛైర్మన్ డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు, సఖిరెడ్డి ప్రభ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.